మానవహారంతో వీవోఏల నిరసన



మానవహారంతో నిరసన

నవతెలంగాణ-జుక్కల్

వీవోఏల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమ్మెలో భాగంగా మంగళవారం జుక్కల్ మండల మహిళ సంఘాలు మద్దతుగా భారీ ర్యాలీ చేపట్టారు. దీక్ష శిబిరం నుంచి ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వరకు వెళ్లి మానవహారం నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం ర్యాలీగా వెళ్తు తహసీల్దార్ గణేష్, ఎంపిడివో నరేష్, ఎస్సై మురళి, ఐకేపీ ఏపిఎంకు వినతి పత్రం అందించారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

బుధవారం 17 మే 2023

నేడు చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

హాజరుకానున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ చేపట్టనున్నట్టు రజక సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని వజ్జపల్లి గ్రామంలో బుధవారం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరుకానున్నట్టు తెలిపారు. కావున రజక సంఘం నాయకులు, సభ్యులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

- ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి
- భారీగా ఏసీలు, కూలర్ల కొనుగోలు.. వినియోగం
- జిల్లాలో పెరిగిన విద్యుత్ డిమాండ్
- 4.125 మిలియన్ యూనిట్లకు పెరిగిన వాడకం

నవతెలంగాణ-నిజామాబాద్‌ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. సాధారణ వినియోగంతో పోల్చితే దాదాపు 1 మిలియన్ యూనిట్ల వినియోగం పెరిగింది. ఎండలు ముదరడంతో ప్రజలు ఏసీలు, కూలర్లకు కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఆ ప్రభావం విద్యుత్ వాడకంపై పడుతోంది. అయితే పరిమితి కన్నా ఎక్కువగా విద్యుత్తు వినియోగం చేస్తే భవిష్యత్తులో డెవలప్‌మెంట్ ఛార్జీలు(డీసీ) భరించాల్సిందేనని విద్యుతు శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం వాడుతున్న కరెంటు రీడింగ్ ఆధారంగా రాష్ట్ర కార్యాలయం నుంచి నేరుగా డీసీ ఛార్జీలు వినియోగదారులకు వెళ్తాయని చెబుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 4.125 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం జరిగింది. సాధారణ వినియోగంతో పోల్చితే 1 మిలియన్ యూనిట్ అధికం. ఈ నెల 31 వరకు ఎండలు మరింత పెరగనున్నాయనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈ డిమాండ్ మరింత పెరిగే అవకాశమున్నట్టు అధికారులు భావిస్తున్నారు.

నిజామాబాద్ జిల్లాలో వివిధ కేటగిరీల కింద మొత్తం 7,97,731 విద్యుత్ సర్వీసు కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 1,79,739 వ్యవసాయ సర్వీసులున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం 24 గంటల పాటు విద్యుత్తు సరఫరా చేస్తోంది. జిల్లాలో 975.43 కిలోమీటర్ల మేర 33 కేవీ లైన్, 8425 కి.మీ 11 కేవీలైన్, 12,852 కి.మీ ఎల్‌టీ లైన్లు ఉన్నాయి. ఈ సీజన్‌లో భానుడి ప్రకోపంతో జిల్లా మండుతోంది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటీవల జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు కూడా నమోదైన విషయం తెలిసిందే. మంగళవారం నిజామాబాద్‌లో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. మధ్యాహ్నం సమయంలో జనాలు భయటకు కాలు పెట్టేందుకు జంకుతున్నారు. అయితే ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీ, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. చల్లటి నీటి కోసం ఫ్రిజ్‌లపై ఆధారపడుతున్నారు. దీంతో ఆ ప్రభావం విద్యుతు వినియోగంపై పడుతోంది. సాధారణంగా జిల్లాలో 126 మెగావాట్స్ విద్యుత్ డిమాండ్‌కు గాను.. 3.159 మిలియన్ యూనిట్లు విద్యుత్తు వినియోగం జరుగుతుంది. కానీ ప్రస్తుతం ఎండల వల్ల విద్యుత్ డిమాండ్ 150 మెగావాట్స్‌కు చేరింది. ఇక విద్యుత్ వినియోగం 4.125 మిలియన్ యూనిట్స్‌కు చేరింది.





డెవలప్‌మెంట్ ఛార్జీలు భరించాల్సిందే..

విద్యుత్ వినియోగంలో భారీగా మార్పులు ఉంటే సగటు వినియోగదారులు డెవలప్‌మెంట్ ఛార్జీలు భరించాల్సిందేనని విద్యుత్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. సాధారణంగా గృహావసరాల కోసం 1కిలోవాట్ వినియోగం వరకు మాత్రమే అనుమతితో సర్వీసు తీసుకుంటారు. అయితే ఆ వినియోగం పెరిగితే ఆ మీటర్ పరిమితిని 2.5 కిలోవాట్‌కు పెంచుతారు. అందుకు అవసరమయ్యే ఛార్జీలను సంబంధిత వినియోగదారులు భరించాల్సి ఉంటుంది. గతంలో జిల్లాలో డెవలప్‌మెంట్ ఛార్జీలను నిరసిస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే.

	కేటగిరి-1	కేటగిరీ-2	కేటగిరీ-3	కేటగిరీ-4	కేటగిరి-5	కేటగిరీ-6(ఎ)	కేటగిరీ-6(బి)	కేటగిరీ-7	కేటగిరీ-8
సర్వీసులు	5,19,358	77,858	3773	1062	1,79,739	4130	7423	3784	185

గ్రంథాలయ ఆత్మఘోష వినరా..?

- సమస్యల ఒడిలో విజ్ఞాన బాంఢాగారాలు





నవతెలంగాణ-నసురుల్లాబాద్

"నేను ఓ గ్రంథాలయాన్ని. నా ఆత్మఘోష కొద్దిగా వినండి. నిత్యం నా వద్దకు పాఠకులు, చిన్నా రులు, విద్యార్థులు విజ్ఞానాన్ని పొందేం దుకు నా వద్దకు వస్తారు. విజ్ఞానం అందించే పుస్తకాలు ఎన్నో నా వద్ద ఉన్నాయి. నన్ను ఎవరు పట్టించుకోకపోవడంతో లక్షల్లో విలువైన పుస్తకాలకు చెదలు పడుతున్నాయి. మున్సి పాలిటీల, గ్రామ పంచాయతీల పాలక నేతలు, అధికారులు ఎవరు నన్ను పట్టించు కోకపోవడంతో సమస్యల చెదలో సతమతమవుతూ, అవస్థలతో అల్లాడుతున్న.

'నేను కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల గ్రంథాల యాన్ని. నన్ను 1971లో అద్దె భవనంలో ఏర్పాటుచేసి ప్రారంభించారు. అనంతరం 1995లో నూతన భవనం నిర్మించి, కొత్త పుస్తకాలతో నన్ను అధునీకరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎందరో మంది విద్యార్థులకు, పాఠకులకు విజ్ఞానాన్ని అందిస్తూ ఎందరికో ప్రభుత్వ ఉద్యోగులు వచ్చేలా సహాయ పడ్డాను. నా వద్ద 13వేల పుస్తకాలు, సుమారు 20 లక్షల విలువ గల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. నా వద్ద సామాన్య గ్రంథములు, తత్వశాస్త్రము, వివిధ మతాల గ్రంధాలు, సామాజిక శాస్త్రములు, భాష శాస్త్రములు సామాన్య శాస్త్రములు, ఉపయుక్త కలలు, లలిత కలలు, సాహిత్యం, చరిత్ర, పోటీ పరీక్షలకు పుస్తకాలు, వార్తాపత్రికలు ఇలా ఎన్నో పుస్తకాలున్నాయి, రండి మీ అందరికీ నా పుస్తకాలు, నా అవస్థలను చూపిస్తాను. అన్ని ఉన్నా.. నా బాగోగు ఎవరు పట్టించుకోవడం లేదు.

గ్రంథాలయంలోకి రావడానికి పాఠకులు భయప డుతున్నారు. శిథిలమైన భవనం, మోకాలు లోతు మురికి నీరు, గ్రంథాలయం చుట్టూ మురికి నీటితో దుర్గంధం లేస్తుంది. భవనం పై కప్పు ఎవరిపై పడుతుందోననే భయం. 30 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుంది. కనీసం నా భవనం మరమ్మతులు చేపట్టక పోవడంతో భవనం పెచ్చులూడుతుంది. స్థానిక నేతలు ఎవరు నన్ను పట్టించుకోవడం లేదు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి సంక్షేమ పథకాలు అభి వృద్ధిలో రాష్ట్రంలోని ఆదర్శంగా బాన్సువాడ నియోజకవర్గం నిలిచేలా చేశారు. మీ నియోజకవర్గంలోనే నేనున్నాను, కనీస సౌకర్యాలు కల్పిస్తే పాఠకులకు, విద్యార్థులను విజ్ఞా నాన్ని అందిస్తాను. కామారెడ్డి జిల్లాలో 18 గ్రంథాలయాలు, మూడు గ్రామీణ గ్రంథాలయాలు ఉన్నాయి.

చెదలు పడుతున్న పుస్తకాలు

జిల్లాలోని అనేక గ్రంథాలయాల్లో క్రమేణా పుస్తకాలు చెదలు పడుతున్నాయి. పుస్తకాలను భద్రపరిచేందుకు తగు సామగ్రి కానీ, గ్రంథాలయాలకు అవసరమైన కంప్యూటర్ల వ్యవస్థ కానీ అందుబాటులో లేవు. గ్రంథాలయాల్లో కంప్యూటర్ల ఏర్పాటుకు ఎంతో కాలంగా ప్రతిపాదనలు న్నాయి. కానీ అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ఒక్కో లైబ్రరీకి కనీసం రెండు కంప్యూటర్లన్నా అవసరం. కానీ.. పట్టించుకునే వారెవరు?.. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు ఈ దుస్థితులను గమనించి గ్రంథాలయ పన్ను బకాయిలు ఇప్పించి గ్రంథాలయాలకు పునరుజ్జీవం ప్రసాదించాలని కోరుతున్నా".

ఇట్లు
మీ విజ్ఞాన భాందాగారాన్ని
శాఖ గ్రంథాలయం, బీర్కూర్.కామారెడ్డి జిల్లా.

జాతీయ డెంగ్యూ దినోత్సవంపై అవగాహన



ర్యాలీ చేపట్టి నినాదాలు చేస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

నవతెలంగాణ-దోమకొండ

జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి జిల్లా పరిషత్ బాలుర పాఠశాల నుండి జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా దగ్గర డెంగ్యూ దోమల వల్ల వచ్చే జ్వరాల గురించి, దోమల వల్ల వచ్చే చికున్ గున్యా, బోదకాలు మెదడు వ్యాపు వంటి వంటి వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో దోమకొండ డిప్యూటీ సబ్ యూనిట్ ఆఫీసర్ జి అంజయ్య, కే మల్లికార్జున్, డిఇఓ ఏఎన్ఎం యాదమ్మ, సంజీవిని, సువర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపల్లి విండోమహాసభలో ఉద్రిక్తత



మాట్లాడుతున్న అధ్యక్షులు సునీల్‌కుమార్

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి మండల కేంద్రంలోని కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం అధ్యక్షులు డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ సెక్రెటరీ కమలేష్ నివేదికలను చదువుతున్న సమయంలో పాలకవర్గంలో కొంతమంది అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణకు దిగారు. పోలీసులు సమావేశ స్థలానికి చేరుకొని శాంతపరిచి సభ సజావుగా జరిగే విధంగా పాలకమండలి పలు తీర్మానాలను చేశారు. గతంలో జరిగిన అవకతవకలకు 51 జీవో ప్రకారం చర్యలు తీసుకుంటామని డిసిఓ ఆదేశాల మేరకు నడుచుకుంటామని అధ్యక్షులు సునీల్ కుమార్ తెలిపారు.

తోకపేర్లు కత్తిరించి..
ఫీజుల దోపిడీ అరికట్టాలి

- విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ డిమాండ్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు విఘ్నేష్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా విద్య పేరు తో అడ్డు అదుపు లేకుండా ఇష్టానుసారంగా ప్రైవేట్ విద్యాసంస్థలు తోక పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నా యని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. ప్రయివేటు, కార్పొరేటు పాఠశాల, కళాశాలలో ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా నగరంలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్యు, ఏఐఎస్బి, టీవీయువి విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ తిరుపతయ్య కమిటీ సిఫార్సులను తుంగలో తొక్కుతూ సంవత్సరానికి కనీసం విద్యాసంస్థలు 5 శాతం లాభాలు గడించా లని ఉన్నా.. అందుకు విరుద్ధంగా విద్యా వ్యాపారం చేస్తున్నవాటిని జిల్లా విద్యా అధికారులు సైతం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో అన్ని విద్యా సంస్థలు తిరుపతయ్య కమిటీ ఇచ్చిన సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒలంపియాడ్, బైజుస్, డీజీ, షాహిన్, లాంటి తోక పేర్లతో పాటు శ్రీచైతన్య, నారాయణ కార్పోరేట్ విద్యాసంస్థల పేర్లను చూసి మోసపోవద్దని విద్యా ర్థులకు, తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వం కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ అనిల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాఘు రామ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కర్క గణేష్, ఏఐఎస్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్ రెడ్డి, టీవీయువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్ సింగ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు ఏ.దేవయ్య



మాట్లాడుతున్న దేవయ్య, జడ్పీ చైర్మన్ విఠల్‌రావు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బాలల హక్కులను పరిరక్షించేందుకు అంకితభావంతో కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు ఏ.దేవయ్య అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్రావు, అదనపు కలెక్టర్ చిత్రమిశ్రాలతో కలిసి బాలల హక్కుల పరిరక్షణ, వారి కోసం ఉద్దేశించిన చట్టాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, వారికి అందిస్తున్న విద్య, వైద్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యుడు దేవయ్య మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో 12 శాతం వరకు బాలలు ఉన్నారని తెలిపారు. చిన్నారులు తమకు ఎదురయ్యే ఇబ్బందులు, బాధల గురించి ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిలో ఉంటారని, అందువల్లే రాజ్యాంగం ద్వారా బాలలకు ప్రత్యేకంగా హక్కులు కల్పించబడ్డాయని అన్నారు. సమాజ మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు సైతం ఎప్పటికప్పుడు కొత్తగా బాలల కోసం చట్టాలను రూపొందిస్తూ అమలు చేస్తున్నాయన్నారు. ఈ హక్కులు, చట్టాలు బాలలకు ఖురాన్, బైబిల్, భగవద్గీతలో సమానమని అభిప్రాయపడ్డారు. బాలల హక్కులు, చట్టాల అమలు తీరును పర్యవేక్షించేందుకు వీలుగా జాతీయ, రాష్ట్ర స్థాయిలలో కమిషన్ లు పని చేస్తున్నాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలో బాల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణ పూర్తి స్థాయిలో జరిగేలా పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని అధికారులకు హితవు పలికారు. ఏవైనా లోపాలు ఉంటే వాటిని సవరించుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. ఈ కర్తవ్యాన్ని సమర్ధవంతంగా నిర్వర్తించినప్పుడే భావి భారత పౌరులైన బాలల భవితవ్యానికి బంగారు బాటలు వేసినట్లవుతుందని సూచించారు.

జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ, గ్రామగ్రామాన కమిటీలు ఏర్పాటై బాలల సంరక్షణ కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం గట్టిగా కృషి చేయాలని సూచించారు. అభంశుభం ఎరుగని చిన్నారుల పట్ల అఘాయిత్యాలు, లైంగిక దాడులు, ఇతరాత్ర అకృత్యాలకు ఒడిగట్టే వారంతా వణికిపోయే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమీక్షా సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ, సుధా రాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి చైతన్య కులకర్ణి, సీడీపీఓలు, పోలీస్, విద్య, వైద్యం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ జితేశ్ వి పాటిల్



పనులు పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-బాన్సువాడ/నసురుల్లాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనుల భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ జితిష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. బాన్సువాడలో నిర్మాణంలో ఉన్న రెవెన్యూ డివిజనల్ భావన పనులను మంగళవారం కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ కలసి పరిశీలించారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి వీలైనంత త్వరగా నూతన భవనాలను అందు బాటులోకి తీసుకొచ్చి ప్రజలకు పాలనా సౌలభ్యం అందించాలనే లక్ష్యంతో ఉంద న్నారు. నాణ్యతా ప్రమా ణాలు పాటించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. పూర్తయిన భవనాలను ప్రారంభి ంచేందుకు సిద్ధం చేయాలని, అదేవిధంగా ప్రారంభం కాని ఆయా పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వీరి వెంట బాన్సువాడ ఆడియో మున్సిపల్ చైర్మన్ గంగాధర్ జిల్లా రైతు సమన్వయ కన్వీనర్ అంజిరెడ్డి అధికారులు పాలక నేతలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి

గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించి జాతీయస్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బాన్సువాడ, నిజాంసాగర్ మండల కేంద్రాల్లో నిర్వహించిన సీఎం క్రీడా పోటీలకు మంగళవారం ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. వివిధ గ్రామాల క్రీడాకారుల మధ్య స్నేహభావం పెరుగుతోందని తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కలెక్టర్ పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పల కొలిమి..

ఎండలకు తోడు వేడిగాలులతో ఉక్కిరిబిక్కిరి



జనసంచారం లేక బోసినపోయిన చౌరస్తా

నవతెలంగాణ-మెండోరా

మండలంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం 8 గంటల నుంచి భానుడు భగభగలాడుతుండటంతో రోడ్లన్నీ నిర్మానుష్యమవుతున్నాయి. మధ్యాహ్న వేళ నిప్పుల కొలిమిలా మారుతోంది. దీంతో అడుగుబయట పెట్టేందుకు జంకుతున్నారు. ఎండలతో పాటు వడగాల్పులతో వీస్తుండటంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మంగళవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయినా.. వడగాల్పులతో ఉక్కపోత పెరిగింది.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

నవతెలంగాణ-లింగంపేట్

రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని నల్లమడుగు సింగిల్ విండో చైర్మన్ సుప్పల రమేష్ రైతులకు సూచించారు. మంగళవారం లింగంపేట్ మండలంలో మోతే ఎల్లారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. నల్లమడుగు సింగిల్ విండో పరిధి రైతులు దళారులను ఆశ్రయించకుండా 7 కొనుగోలు కేంద్రాలను ముందస్తుగానే ప్రారంభించమ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తుందని, ఏ గ్రేడ్‌కు రూ.2060, బి గ్రేడ్‌కు 2040 రైతుల ఖాతాలో నేరుగా జమ చేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ బ్యాంకాక్ జిరాక్స్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అందజేయాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం రాత్రి వేళలో కొనుగోలు కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యం గన్ని బ్యాగ్స్ అందుబాటులో ఉంచామన్నారు. తేమ శాతాన్ని పరిశీలించి వెంటనే తూకం వేయనున్నట్టు తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మోతే సర్పంచ్ ఏలేటి రామ్ రెడ్డి, ఎంపీటీసీ సిద్ధి రాములు, సింగిల్ విండో కార్యదర్శి మైపాల్, డైరెక్టర్ దాసరి సాయి రెడ్డి, ఎల్లాల సాయి రెడ్డి, మాసాల శ్రీనివాస్, సురేందర్, భాగయ్య, సంగమేశ్వర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ రమేశ్

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కోసం 18న హైదరాబాద్‌లో మహాధర్నా

విజయవంతం చేయండి : టీడబ్ల్యూజేఎఫ్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)



మాట్లాడుతున్న వేణు

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూ జేఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 18న హైదరా బాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు కోరారు. మంగళవారం కామారెడ్డిజిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహాధర్నాకు జర్నలిస్టులందరూ పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ నాయకుడు కృష్ణ చారి, అక్రిడేషన్ కమిటీ మెంబర్ కృష్ణమూర్తి, మీడియా కో కన్వీనర్ బాలాజీ, జిల్లా సలహాదారుడు సబ్బాని ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు.. ప్రతి ఇంటికి వెలుగు

నవతెలంగాణ-నందిపేట్



మండలంలోని వెల్మల్ గ్రామంలో కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సాయమ్మ, ఎంపీటీసీ మీనా జ్యోతి ప్రజ్వలన చేసి మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు తమ ఆధార్ కార్డు చూపించి పరీక్షలు చేసుకోవచ్చన్నారు. అవసరమైన వారికి కంటి అద్దాలు ఇస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నారాయణ, బీఆర్ఎస్ నాయకులు పెద్ద గంగారాం, శంకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి ఘన సన్మానం

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని దూపల్లి గ్రామంలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం ముగింపు సమావేశంలో సర్పంచ్ సాయిరెడ్డి వైద్య సిబ్బందిని శనివారం ఘనంగా సన్మానించారు. దూపల్లి గ్రామంలో గత 20 రోజులుగా కంటి వెలుగు కార్యక్రమాన్ని పూర్తిచేసిన వైద్య సిబ్బందికి సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. 2300 మంది 18 సంవత్సరాల పైబడిన వారందరినీ గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంచి సాయిలు, కంటి వైద్య నిపుణులు, కరిపి రవీందర్, శ్రావణ్ కుమార్, సూపర్‌వైజర్ మాలంబి, కార్యదర్శి సీహెచ్.సాయి, కారోబార్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమ కాటుతోనే డెంగ్యూ

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సూచించిన వైద్యులు
- డెంగ్యూ దినోత్సవం సందర్భంగా పలుచోట్ల ర్యాలీ

నవతెలంగాణ-విలేకరుల బృందం

డిచ్‌పల్లి : ఏడిస్ ఈజిప్ట్ అనే దోమ కుట్టడం ద్వారా డెంగ్యూ వ్యాధి వ్యాపిస్తుందని, ఈ దోమలు పగటిపూట మాత్రమే కుడుతాయని, డెంగ్యూ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని ఇందల్‌వాయి మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నవత, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ మానస, పబ్లిక్ హెల్త్ నర్స్ ఎలిజిబెత్, సూపర్‌వైజర్ ఉమారాణి, మహేష్, మణితేజ, ఆరోగ్య కార్యకర్తలు సంతోషి, స్వర్ణ, సుజాత, దేవిమేరీ, సాయి వీర కుమారి, భానుప్రియ, స్టాఫ్‌నర్స్ సునీత, ల్యాబ్ టెక్నీషియన్ అనిత, గంగుబాయి, రాధిక, లేయ, ఆశాకార్యకర్తలు పద్మ, పాశం జ్యోతి, బండ ప్రమీల, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ర్యాలీ..

మోర్తాడ్ : మండల కేంద్రంలో సీహెచ్‌సీ సిబ్బంది జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రవికుమార్ మాట్లాడుతూ.. డెంగ్యూ వ్యాధికి గురికాకుండా ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని సూచించారు. డెంగ్యూ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ వివేక్‌తో పాటు సిబ్బంది ఆశావర్కర్లు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది



మోర్తాడ్‌లో..

డెంగ్యూ నివారణకై పట్టణంలో ర్యాలీ..

ఆర్మూర్ : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలంలో డెంగ్యూ జ్వరాలు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలు తమ ఇంటి చుట్టూ, దాబా మీద వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు. ప్రతిరోజు డ్రై డే పాటించాలని తెలిపారు. ముఖ్యంగా డబ్బాలు, పాత టైర్లు, కొబ్బరి బోండాలు చిప్పలు, చాయ్ కప్స్, ప్లాస్టిక్ గ్లాసులు, పాత్రలు, కుండలు, కూలర్లు, ఫ్రిడ్జ్ వెనకాల నీరు నిలిచే ప్రదేశంలో, నీరు నిల్వ లేకుండా నీటిని పారబోసి ఎండ పెట్టాలని సూచించారు.

డెంగ్యూ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించిన వైద్యులు..

ఏర్గట్ల : మే 16వ తేదీ జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వైద్యులు ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి ఎలా వస్తుంది?, దానికి గల కారణాలు ఏమిటీ ?, దానికి సంబంధించిన దోమ రకాలను గురించి వివరిస్తూ.. ఏ విధంగా వ్యాధిని నివారించుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?, చికిత్స విధానం మొదలైన వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ, హెల్త్ సూపర్‌వైజర్ మారుతి, హెల్త్ అసిస్టెంట్ పండరీ, ఏఎన్ఎం కల్పన, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోచంపాడ్ పీహెచ్‌సీలో డెంగ్యూ దినోత్సవం..

మెండోరా : పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాకేష్ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఫ్లెక్సీ ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. అందులో భాగంగా వారు మాట్లాడుతూ.. గత కొన్నేండ్లుగా ఇండియా లో డెంగ్యూ కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయని అన్నారు. అందుకు వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడం కోసం ప్రతీ సంవత్సరం మే 16న నేషనల్ డెంగ్యూ దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. ఈ వ్యాధి ప్రాణాపాయంతో కూడుకొన్న వెక్టర్ వల్ల సంక్రమించే వ్యాధి అని, ఈ వైరస్ వెస్ట్ నైల్ ఇన్ఫెక్షన్, పసుపు జ్వరానికి సంబంధించినదని వివరించారు. డెంగ్యూ వైరస్ సోకిన ఏడిస్ దోమ కుట్టడం ద్వారా డెంగ్యూ జ్వరం వ్యాపిస్తుందని తెలిపారు. డెంగ్యూ సోకిన వ్యక్తిని దోమ కుట్టడంతో దోమకు కూడా ఈ వ్యాధి సోకుతుందని సూచించారు.

డెంగ్యూ ఫీవర్ వ్యాపించిన ఆరు రోజుల తర్వాత దాని లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. తీవ్రమైన తలనొప్పి, కీళ్ల నొప్పి, కండరాల నొప్పి, వికారం, తొందరగా అలసిపోవడం, జ్వరం, వాంతులు 5రోజులు తరువాత చర్మంపై దద్దుర్లు, తేలికపాటి రక్తస్రావం అత్యంత సాధారణ లక్షణాలు కనిపిస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో పోచంపాడ్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత ఎలక్ట్రిషియన్ సీసీ టీవీ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) బుధవారం నుంచి నిర్వహించే ఎలక్ట్రిషియన్, 19 నుంచి నిర్వహించే సీసీ టీవీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అ సంస్థ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ శిక్షణ ఎలక్ట్రిషియన్ 30 రోజులు, సీసీ టీవీ శిక్షణ 19నుంచి 13రోజుల పాటు నిర్వహించనున్నట్టు వివరించారు. ఉచిత శిక్షణతో పాటుగా ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పించనున్నట్టు శ్రీనివాస్ వివరించారు. శిక్షణా అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేస్తామని, శిక్షణకు కావాల్సిన అర్హతలు 19 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగి ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులు ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. శిక్షణకు వచ్చేవారు తమ వెంట ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్, 10వ తరగతి ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తమవెంట తెచ్చుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08461-295428 నెంబర్‌లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో పలువురి చేరిక

నవతెలంగాణ-భీంగల్

రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలంగాణ ఉద్యమకారుడు కేసీఆర్ అందిస్తున్న జనరంజక పాలనకు ఆకర్షితులై ఆయన అడుగుజాడల్లో నడిచేందుకు యువత పార్టీలో చేరుతున్నారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బడాభీంగల్, చేంగల్, ముచ్కూర్, బాబాపూర్ గ్రామాలకు చెందిన 200 మంది కాంగ్రెస్, బీజేపీకి చెందిన యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్‌పై అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతి వార్డులో ఆర్.ఆర్.ఆర్. (రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ యం.హెచ్.ఓ సాజీద్ అలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా నగరంలో ప్రతి వార్డులో రెడ్యూస్, రీయూస్, రీసైకిల్‌కు సంబంధించిన కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఇందుకు ఆర్.ఆర్.ఆర్. కేంద్రాల గురించి ప్రజాలకు అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్రల వద్ద స్వయం సహాయక సంఘాలకు చెందిన 10 మంది ఉండాలని సూచించారు. ఈ నెల 20 నుంచి జూన్ 5 వరకు ఈ కార్యాక్రమం ముమ్మరంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ సాజీద్ అలీ, శానిటరీ ఎస్ఐ ప్రశాంత్, సునీల్, నటరాజ్‌గౌడ్, ప్రభుదాస్, శ్రీకాంత్, మహిపాల్, సోలోమెన్రాజ్, మెప్మా సీఓలు, ఆర్పీలు హాజరయ్యారు.

పీహెచ్‌డీ పట్టాలపై సమగ్ర విచారణ చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పీహెచ్‌డీ పట్టాలపై సమగ్ర విచారణ చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, ఒకపక్క వీసీ అక్రమాలు, మరోవైపు పీహెచ్‌డీ విద్యార్థుల దగ్గర డబ్బులు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. 2021 నుంచి 2023 వరకు పీహెచ్‌డీ చేసిన వారి పట్టాలు పొందారని, బీఆర్ఎస్ పార్టీ అనుచరులకు అర్హులు కాకపోయినా పీహెచ్‌డీ పట్టాలు ఇవ్వడం సిగ్గుచేటని ఆరోపించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అఖిల్, నగర నాయకులు దేవేందర్, ప్రశాంత్, కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాల ఆగడాలను అరికట్టాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రయివేటు పాఠశాల ఆగడాలను అరికట్టాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నందగిరి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు కలెక్టర్ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాల ఆగడాలను, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని నగరంలోని అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా యువ మోర్చా జిల్లా అధ్యక్షులు నందగిరి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం, ప్రయివేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎర్రం సుధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అమందు విజయకృష్ణ, మండల అధ్యక్షులు ఎండల క్రాంతి, ఇందూర్ సాయి, కాలేరు దినేష్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వారోత్సవాలు నిర్వహిస్తూ నివేదికలు అందజేయాలి

నవతెలంగాణ-పిట్లం

రాబోయే తెలంగాణ దశాబ్ది వేడుకలలో భాగంగా గ్రామ పంచాయతీలలో నేటి నుంచి 23 వరకు పల్లెప్రగతి, ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో సెక్రటరీల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలలో అన్ని రకాల పారిశుద్ధ్య పనులు, నీటి సరఫరా, కరెంటు సమస్యలతోపాటు అప్రోచ్ రోడ్డు పనులు, వంగిన చెట్లను సరి చేయడం, ట్రీ గార్డ్ ఏర్పాటు చేస్తూ వాటరింగ్ డే నిర్వహించాలని, మహిళ సంఘాల యాక్టివిటీస్‌తో పాటు బ్యాంకు లావాదేవీలు, మండల మహిళా సమైక్యను భాగస్వామ్యం చేసుకొని వారం రోజులపాటు ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించాలని ఆయన సూచించారు. మండల పంచాయతీ అధికారి బ్రహ్మం, ఆయా పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.

తొర్తి చెరువుల్లో ఉన్న మొసళ్ళను పట్టుకోవాలి

నవతెలంగాణ-ఏర్గట్ల

తొర్తి గ్రామంలోని ఊర చెరువు, నల్ల చెరువుల్లో తిరుగుతున్న మొసళ్ళను పట్టుకొని రక్షణ కల్పించాలని తొర్తి మత్స్యకారులు ఎమ్మార్వో జనార్ధన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొసళ్ళ వల్ల మత్స్యకారులకు, పశువులకు, మేకలకు, గొర్రెలకు ప్రాణహాని ఉందని ఈ నెల 12వ తేదీన అటవీశాఖ అధికారులు మొసళ్ళను చూశారని, వాటిని వారు పట్టాలంటే చెరువుల నుంచి తూముల ద్వారా నీటిని తీసివేయాలని కోరారు. గత 5 సంవత్సరాల నుంచి నీరు నిల్వ ఉండడం వల్ల మురికి చేరి చెడువాసన వస్తుందని కావున నీటిని కూడా తీసివేయాలని ఆయనను కోరారు. ఇందులో భాగంగా మత్స్యకారులు తోపారం రాజేశ్వర్, తోకల ఈశ్వర్, తోపారం రాం చందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, సంతోష్ కుమార్, లచ్చయ్య, స్వామి, హన్మాండ్లు, గంగాధర్, నర్సయ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల చెలామణిని అణిచివేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో నకిలీ విత్తనాలు చెలామణి కాకుండా ఉక్కుపాదంతో అణిచివేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి సూచించారు. రైతాంగ ప్రయోజనాలను కాపాడడమే పరమావధిగా అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. రాష్ట్ర డీ.జీ.పీ అంజనీకుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు తదితరులతో కలిసి మంత్రి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. నిజామాబాద్ కలెకర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ కోసం దరఖాస్తు చేసుకోండి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి తెలియజేశారు. సంచలనాత్మక హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొల్పే దిశగా జూన్ 2న నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ కోసం నిజామాబాద్ జిల్లా అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో గల యువతీ, యువకులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. సంచలనాత్మక హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొల్పే దిశగా జూన్ 2న నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీలో పాల్గొనాలనుకునే అభ్యర్థులు ముందుగా 7661899899 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ వెబ్‌లింక్‌తో కూడిన ఒక ఎస్.ఎం.ఎస్‌ను పొందుతారని ఆ లింకు ద్వారా వారి వివరాలను అందులో జూన్ 1వ తేదీలోగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. పోటీలో పాల్గొన్న అభ్యర్థులకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రథమ బహుమతి కింద ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతి కింద స్మార్ట్‌ఫోన్, తృతీయ బహుమతి కింద ట్యాబ్‌పాటు ప్రతి నియోజకవర్గంలో 40 ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్టు వివరించారు. ప్రోత్సాహక బహుమతులలో 10 స్మార్ట్‌వాచ్లు, 10 ఇయర్‌పాడ్లు, 10 హార్డ్ డ్రైవ్‌లు, 10 పవర్ బ్యాంకులు బహుకరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు విక్కీ యాదవ్, ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాజ నరేందర్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు దయాకర్‌గౌడ్, నందిపేట్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు పెంట ఇంద్రుడు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు వినయ్, శరత్, ప్రభాకర్, అష్రఫ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

నేడు మినీ మహానాడును జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేడు మిని మహానాడు విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంటు అధ్యక్షులు దేగాం యదాగౌడ్ పేర్కొన్నారు. ఆర్మూర్ లో ఈ నెల 17న జరిగే ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు మినీ మహానాడు కార్యక్రమం జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ పరిధి ఆర్మూర్ నియోజకవర్గం, ఆర్మూర్ పట్టణం లోని పెర్కిట్ రోడ్‌లో గల ఎంఆర్ గార్డెన్‌లో 'ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు', మినీ మహానాడు' ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, టీటీడీపీ సమన్వయకర్త కంభంపాటి రామ్మోహనరావు, పోలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి (నిజామాబాద్ ఇంచార్జి), అరవింద్ కుమార్‌గౌడ్, బక్క నర్సింలు, కాశీనాథం, నన్నూరి నర్సారెడ్డి, కాట్రగడ్డ ప్రసూన, భూపాల్ రెడ్డి, తిరునగిరి జ్యోష్న, రాష్ట్ర కమిటీ నాయకులు, రాష్ట్ర అనుబంధ సంఘం అధ్యక్షులు, పార్లమెంట్ కోఆర్డినేటర్లు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వైన్స్‌ను తనిఖీ చేసిన ఎక్సైజ్ అధికారులు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని వైన్స్‌లో అధిక ధరలకు మద్యాన్ని అమ్ముతున్నారని ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందడంతో వైన్స్‌ను మంగళవారం తనిఖీ చేశారు. వారం క్రితం ప్రభుత్వం మద్యంపై ధరలను తగ్గించింది. అయితే వైన్స్ యజమానులు పాత ధరలకే అమ్ముతున్నారు. ఎక్సైజ్ అధికారులు వైన్స్‌లోని వేబిల్లులు తనిఖీ చేశారు. నూతన ధరలను అమ్మాలని వైన్స్ యజమానులకు సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సంఘాల ఆడిటింగ్

నవతెలంగాణ-మోర్తాడ్

గ్రామాలకు సంబంధించిన మహిళా సంఘాల 2022-23 సంవత్సరానికి సంబంధించి ఆడిటర్ ద్వారా లెక్కల వివరాలను ఆడిట్ చేయించినట్టు ఏపీఎం ప్రమీల తెలిపారు. ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, పూర్తి వివరాలను ఆడిటర్ ద్వారా పరిశీలన చేయించి లెక్కలను నమోదు చేయించినట్టు తెలిపారు. ఆడిటింగ్‌లో రాజశేఖర్, సిబ్బంది గంగా మోహన్, సాయిచరణ్ 10 గ్రామ సంఘాల అధ్యక్షులు ఎమ్మెస్సీయే అకౌంటెంట్లు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే

సీఎం కప్ పోటీలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

మెండోరా : గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహించడానికి, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి ప్రశాంత్ రెడ్డి ఆదేశానుసారంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల అధికారుల, ప్రజాప్రతినిధుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి సీఎం కప్ 2023 క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, మరింతగా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎం కప్-2023 క్రీడా పోటీలు తల పెట్టారని అన్నారు. క్రీడలు శారీరక ధారుఢ్యాన్ని పెంపొందించడంతోపాటు మానసికోల్లాసాన్ని కలుగజేస్తాయని అన్నారు. గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణం కలిగి యువతీ యువకులు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే సీఎం కప్ ముఖ్య ఉద్దేశమన్నారు. పేద విద్యార్థులు, యువతీ యువకుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే ఈ పోటీలలో పాల్గొనేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతోపాటు క్రీడలపైనా దృష్టి సారించేలా చూడాలని సూచించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి కాసేపు ఆటలు ఆడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీపీ బురుకల సుకన్య కమలాకర్, జడ్పీటీసీ తలారి గంగాధర్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొల్లపల్లి అరుణ నవీన్‌గౌడ్, పోచంపాడ్ ఉప సర్పంచ్ సంపంగి సతీష్, ఎంపీఓ సాయిలు, పీఈటీలు, యువత క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఎంపీపీ..

వర్ని(చందూర్) : సీఎం కప్ 2023 క్రీడల్లో భాగంగా రెండవ రోజు చందూర్, వర్ని మండల కేంద్రంలోని పలు గ్రామాలకు చెందిన యువకులకు పోటీలు నిర్వహించారు. రెండో రోజులో భాగంగా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో పాల్గొని విజయం పొందిన యువకులను స్థానిక మండల ఎంపీపీ లావణ్య రామ్‌రెడ్డి, ఎంపీడీవో నీలావతి, వర్ని ఎంపీడీవో బసిరుద్దీన్, ఎంపీఓ చందర్ విజయం పొందిన యువకులను అభినందించారు.

సీఎం కప్‌లో ఖోఖో విన్నర్‌గా రాంపూర్..

నవీపేట్: సీఎం కప్‌లో భాగంగా మండల కేంద్రంలో రెండో రోజు నిర్వహిస్తున్న క్రీడా పోటీలలో ఖోఖో విన్నర్‌గా రాంపూర్ టీం గెలుపొందినట్లు పీఈటీ రవి మంగళవారం తెలిపారు. సీఎం కప్‌లో భాగంగా వాలీబాల్, కోకో, రన్నింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. రాంపూర్ జట్టు గెలవడంతో రాంపూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి అల్లం రమేష్ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.



ఏర్గట్ల : తడపాకల్‌లో సీఎం కప్ పోటీలు ప్రారంభం..

కొలహోలంగా చీఫ్ మినిస్టర్ కప్ పోటీలు.. (ఫోటోలు)

కమ్మర్‌పల్లి : మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న చీఫ్ మినిస్టర్ కప్ 2023 ఆటలు రెండవ రోజైనా మంగళవారం విజయవంతంగా కొనసాగాయి. వివిధ గ్రామాల నుంచి ఆటలు ఆడేందుకు వచ్చిన క్రీడాకారులు, క్రీడలను చూసేందుకు వచ్చిన సందర్శకులతో బషీరాబాద్ ఉన్నత పాఠశాల వద్ద కోలాహలం నెలకొంది. కబడ్డీ, వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లను సర్పంచ్ సక్కారం అశోక్ ప్రారంభించారు. కబడ్డీలో ఉప్లూర్ విన్నర్‌గా, చౌట్‌పల్లి రన్నర్‌గా, వాలీబాల్‌లో అమీర్‌నగర్ విన్నర్‌గా, కోనాపూర్ రన్నర్‌గా నిలిచాయి. షాట్‌పుట్‌లో బషీరాబాద్ గ్రామానికి చెందిన పటేరి రంజిత్ విజయం సాధించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎస్.నారాయణ, ఎన్.రమేష్, ఆర్.పి.రాజు, బి.రాజు, బైకాని మహేష్, పీఈటీ గంగాధర్, మహిళ పీఈటీలు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

తడపాకల్‌లో సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం..

ఏర్గట్ల : సీఎం కప్ మండలస్థాయి క్రికెట్ పోటీలు తడపాకల్ గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో ఎంపీపీ ఉపేంధర్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా ఈ పోటీలను ప్రవేశపెట్టారని, ఇందులో మొదటగా మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నారని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సర్పంచ్లు పత్తిరెడ్డి ప్రకాష్, కట్కం పద్మాసాగర్, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, ఎమ్మార్వో జనార్ధన్, ఎంపీడీఓ రాజేశం, ఎంపీఓ శివ చరణ్, ఎంఈఓ ఆంధ్రయ్య, తాళ్ళరాంపూర్ పీఏసీఎస్ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి, తడపాకల్ ఉపసర్పంచ్ లోలపు అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలలో అమ్మాయిల ప్రతిభ..

భీంగల్ : మండలంలోని బాబాపూర్ గ్రామంలో సోమవారం ఆరంభమైన సీఎం కప్ పోటీలలో భీంగల్ పట్టణ కేంద్రంలోని బోయిగల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ప్రతిభ కనబర్చారు. కబడ్డీలో ప్రథమ, వాలీబాల్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారని పీడీ గోపిరెడ్డి తెలిపారు. వేసవి సెలవులలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను అందజేసామని అందులో భాగంగానే తమ ప్రతిభను ప్రదర్శించారని ఆయన తెలిపారు.

క్రీడోత్సవాలను ప్రారంభించిన ఎంపీపీ రజిని కిషోర్..

రెంజల్ : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సీఎం కప్ క్రీడలను ఎంపీపీ రజిని కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలగజేస్తాయన్నారు. 15 సంవత్సరాల పైబడిన వారు 36 సంవత్సరాలలోపు ఉన్న యువత ఈ క్రీడల్లో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌస్‌ఉద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభమైన సీఎం కప్ క్రీడా పోటీలు మంగళవారం సైతం ప్రశాంతంగా జరిగాయి.



రెంజల్ : క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ

23వ రోజుకు చేరుకున్న వీవోఏల సమ్మె

నవతెలంగాణ-రెంజల్/ఎడపల్లి

మండల పరిషత్ కార్యాలయం ఎదుట గత 23 రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న వీవోఏల సమ్మె కొనసాగుతోంది. ఐకేపీ వీవోఏలకు రూ.18వేల గౌరవ వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గత కొన్నేండ్లుగా ప్రభుత్వం తమ సేవలను గుర్తించడం లేదని వీవోఏల సంఘం అధ్యక్షులు గంగాధర్ ఆవేదన వ్యక్తం చేశారు. డీఆర్‌డీఏ ద్వారా తమకు గౌరవ వేతనాలు అందించాలని, శ్రీనిధి ద్వారా మరో రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని వీవోఏలు పాల్గొన్నారు.

బతుకమ్మతో నిరసన..

ఎడపల్లి : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద వీవోఏలు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వీవోఏలు సమ్మె శిబిరంలో బతుకమ్మ ఆటపాటలతో గొబ్బెమ్మలేస్తూ నిరసన చేపట్టారు.

తడిపొడి చెత్త సేకరణపై అవగాహన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ మేప్మా మెబెర్స్‌తో మెరా లైఫ్ మెరా స్వచ్ షెహర్ అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జీవన్ మాట్లాడుతూ పొడి చెత్తను ఏ విధంగా వేరు చేయాలని పొడి చెత్తను సేకరించి మున్సిపల్ కార్మికులకు ఏ విధంగా పంపాలో అనే విషయాలు వెల్లడించారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు పొడి చెత్త వల్ల కలిగే లాభాలను వివరించాలని వారానికి ఒకసారి పొడి చెత్త సేకరించాలని తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేప్మా మెబెర్స్ వివోలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొడుగు మర్రి తండ గ్రామపంచాయతీ పరిధిలో గల సున్నపురాళ్ల తండాలో మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.ఐదు లక్షలతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ శ్రవంత పరమేష్, ఉప సర్పంచ్ రవి నాయక్ ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులకు నిధులు కేటాయించిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గడ్డం గంగారెడ్డి, పరమేష్, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే తెలంగాణే..

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజల సురేందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-గాంధారి

దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి తెలంగాణలో జరుగుతోందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజల సురేందర్ అన్నారు. గాంధారి మండలంలో 30 మంది డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు రూ.32,50,000/- విలువ గల చెక్కులను అందజేశారు. మండలంలోని ముదెల్లి గ్రామ పంచాయితీలో 25 మంది డబుల్ బెడ్ రూం లబ్ధిదారులకు రెండో విడతగా రూ.22,50,000/- విలువ గల 25 చెక్కులను , హేమ్లానాయక్ తండాలో 5 మందికి మొదటి విడుతగా రూ.10 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నట్టు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాధబలరాం, జడ్పీటీసీ శంకర్ నాయక్, మాజీ జడ్పీటీసీ తానాజీరావు, గాంధారి సొసైటీ చెర్మెన్ సాయికుమార్, ముద్దెల్లి సొసైటీ చెర్మెన్ సజ్జన పల్లి సాయిరాం, ముద్దెల్లి సర్పంచ్ పిట్ల కళావతి లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లండి

- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన వీఆర్ఏలు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎల్లారెడ్డి విఆర్ఏలు ఎమ్మెల్యే జాజల సురేందర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విఆర్ఏ జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఎమ్మెల్యేలను కలిసి విన్నవించుకుంటున్నట్టు తెలిపారు. వీఆర్ఏలకు పేస్కేలు సహా ఇతర డిమాండ్‌లు నెరవేర్చేందుకు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినందున ఇదే విషయాన్ని 17న జరిగే సమావేశంలో సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే సురేందర్ తప్పకుండా సీఎం కేసీఆర్ దృష్టికి లేదా ఐటీ మినిస్టర్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెఎసి నాయకులు మెట్టు రవీందర్, అంజయ్య, వెంకటేష్, కాశిరాం, వినోద్, శ్రీనివాస్, సాయిలు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/సదాశివనగర్

ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సాయిబాబా మంగళవారం తెలిపారు. ఈనెల 16 నుంచి 25 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, స్థానిక ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశం పొందడానికి దరఖాస్తులను ఆహ్వానించినట్టు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. ఎంపిసి, బైపిసి, సిఈసి, ఎంఈసి గ్రూపుల్లో ఒక్కో దాంట్లో 40 సీట్లు ఉన్నట్టు తెలిపారు. పదవ తరగతిలో సాధించిన జీపిఏ ఆధారంగా సీట్లను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. www.tsmodelschools.com అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోచ్చని పేర్కొన్నారు.

సదాశివనగర్ : ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండలంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ భానుమతి వైస్ ప్రిన్సిపల్ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో చేరాలనుకునే వారు ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో దాంట్లో 40 సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.tsmodelschools.com అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష మెరిట్ జాబితాను విడుదల చేసినట్టు తెలిపారు. ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు పాఠశాలలో వారి మెరిట్ జాబితా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి 23వరకు ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ ప్రత్యేక అధికారులుగా బుధవారం 17 నుంచి 23 వరకు పారిశుద్ధ్య వారోత్సవాల నిర్వహణ కొరకు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులుగా పలువురిని నియమించినట్టు, ప్రత్యేక అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంపీడీవోలు గోపి బాబు, రాములు నాయక్ మంగళవారం వేర్వేరుగా ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో మే మాసంలో నిర్వహించే పారిశుద్ధ్య వారోత్సవాల నిర్వహణకు మండల స్థాయి అధికారులను గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులుగా నియమించామని, 17 నుండి 23 వరకు జరుగు పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహణకు మీకు కేటాయించిన గ్రామ పంచాయతిలో పాల్గొని కలెక్టర్ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహణకు సంబంధించిన రిపోర్ట్ లను గ్రామ కార్యదర్శి ద్వారా మండల కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాల సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు

- ముందస్తు ప్రణాళికతో రైతులకు ఇబ్బందులు రానీయొద్దు
- కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో ముందస్తు ప్రణాళికతో రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళశారం వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఏఎస్పీ అన్యోన్య, ఇంచార్జ్ జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులతో మాట్లాడారు. నకిలీ విత్తనాలు అరికట్టడానికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. త్తి నకిలీ విత్తనాలను బట్ట సంచులలో తీసుకొని



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వస్తున్నారని, హెచ్.టి. కాటన్ పట్ల చట్టబద్ధమైన ఆమోదం లేదని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, తనిఖీ సమయంలో టెస్ట్ కిట్స్ వెంట ఉంచుకోవాలని, రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించేలా చూడాలని తెలిపారు.

మంత్రి సూచనల ప్రకారం వచ్చే వానాకాలంలో పచ్చి రొట్టె ఎరువుల కోసం 7,125 క్వింటాళ్ల విత నాలు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో ఉన్న టాస్క్ ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వ హిస్తూ అనుమానిత ప్రదేశాలలో వెంటనే శాంపిల్స్ చెక్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

విత్తన డీలర్లు దుకాణాల్లో తప్పనిసరిగా లైసెన్స్ ప్రదర్శించాలని, విత్తనాల విక్రయ బిల్లు పూర్తి వివరాలతో అందించాలని, స్టాక్ రిజిస్టర్ నిర్వహణ, ఫారం డీ సమర్పణ, లైసెన్స్ రెన్యువల్ చేయడం, షాపు మార్పు వివరాలు లైసెన్స్ లో నమోదు వంటి అంశాల పై అధికారులు విత్తన డీలర్లకు, వ్యాపారస్తులకు సమాచారం అందించి సవరించేలా చూడాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీల సమయంలో గడువు తేది ముగిసిన విత్తనాలు అమ్మడం, లైసెన్స్ లేకుండా విక్రయాలు చేపట్టడం, హెచ్.టీ పత్తి విత్తనాల అమ్మకం, లైసెన్స్ ఇతరులకు అందించి విక్రయాలు చేపట్టడం, నకిలీ విత్తనాలు ఉండటం వంటి అంశాల పట్ల కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి ఎప్పటికప్పుడు సమాచారంతెలుసుకుంటూ నకిలీ విత్తనాల పై చర్యలు తీసుకోవాలని అన్నారు. చేపల, గేదెల పెంపకం, ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

అధికారులు జవాబుదారీతనంగా ఉండాలి

- సర్వసభ్య సమావేశానికి పలువురి అధికారుల గైర్హాజరు పట్ల ఎంపీపీ

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మూడు మాసాలకు ఒకసారి నిర్వహించే మండల సర్వేసభ్య సమావేశానికి మండల పరిధి అధికారులు పలు గ్రామాల సర్పంచులు గైర్హాజరు కావడం గమనార్హం. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మండల అధికారులు ప్రజలకు, సభ్యులకు జవాబుదారీతనంగా ఉండాలని ఎంపిపి రఘు సూచించారు. బీర్కూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ రఘు అధ్యక్షతనలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ నివేదికను ఎంపీడీవో భాను ప్రకాష్ సభకు చదివి వినిపించారు. వ్యవసాయ శాఖ నివేదికను ఏవో కమల చదివి వినిపించారు, రైతులు వరి పంటతో పాటు ఆరితేడి పంటలు పై దృష్టి సాధించాలన్నారు. నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో గల రైతులు ముందుగా వరి నాట్లు వేసుకుంటే అకాల వర్షం ప్రమాదంలో



సర్వసభ్య సమావేశంలో నివేదిక ప్రవేశపెడుతున్న అధికారులు

అరికట్టవచ్చును అన్నారు. గత సమావేశంలో చేసిన తీర్మానాలు ఏ మేరకు అమలు అయ్యాయో సభకు తెలుపాలని పట్టుబట్టారు. దినికి ఎంపీపీ సమాధానం ఇస్తూ సభలో చేసిన తీర్మానాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్టు తెలిపారు. రెవెన్యూ శాఖ నుంచి ఆర్ఐ మాట్లాడుతూ జీవో 58, 59 ప్రకారం వివిధ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామపంచాయతీ కేటాయించిన ఉచిత స్థలాల్లో నివాసమున్నవారికి ప్రభుత్వం పట్టాలిస్తుందన్నారు.

వర్షాకాలంలో మొక్కలు పంపిణీ చేయాలని ఫారెస్ట్ అధికారులను కోరారు. రెవెన్యూ, వ్యవసాయ, వైద్య, నీటి పారుదల, విద్యుత్, ఉపాదిహామి, ఫౌర సరఫరాల, శిశు సంక్షేమ శాఖ, రోడ్డు భవనాల శాఖ, ఉద్యానవనం, పశువైద్య శాఖలపై ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు వారి ప్రగతిని వివరించగా మిగతా శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఉపాదిహామీ ఏపిఓ మాట్లాడుతూ మండలంలోని ప్రతీ గ్రామానికి నర్సరీని ఏర్పాటు చేసి లక్షల మొక్కలను పెంచనున్నట్టు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు గైర్హాజరుతో జరిగిన మండల సర్వసభ్య సమావేశం శాఖలపై పూర్తిస్థాయిలో చర్చ జరగకకుండానే నామమాత్రంగా ముగించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి స్వరూప శ్రీనివాస్ వివిధ గ్రామాల ఎంపిటిసిలో సర్పంచులు మండల పరిధి ఉన్నత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం రవాణాకు ఇసుక లారీలు తరలింపు



లారీలను తనిఖీ చేసి తరలిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బిచ్కుంద

రైతుల వద్దనున్న వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుండి తరలించేందుకు లారీల కొరత తీవ్రత ఏర్పడడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీవో అధికారులు ప్రత్యేక టీంగా ఏర్పడి ఇసుక తరలించేందుకు వచ్చిన లారీలను వరి ధాన్య కొనుగోలు కేంద్రాలకు తరలించారు. మంగళవారం ఆర్టీవో అపర్ణ, తహసిల్దార్ భరత్ వారి బృందంతో కలిసి మండలంలోని మంజీర పరివాహక ప్రాంతానికి ఇసుక తరలించేందుకు వస్తున్న లారీలను గుర్తించి వాహనాల ధ్రువపత్రాలు సేకరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లారీలను వరి కొనుగోలు కేంద్రాలకు తరలించారు.

తక్కువ బరువున్న చిన్నారులకు డబుల్ రేషన్ ఇవ్వాలి

- ట్రైయినీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



విద్యార్థుల ఎత్తు, బరువు కొలతలున పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్

నవతెలంగాణ-పిట్లం

తక్కువ బరువు ఉన్న చిన్నారులకు డబుల్ రేషన్ అందించాలని కామారెడ్డి జిల్లా ట్రెనింగ్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 7వ అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదలకు పౌష్టిక ఆహారం అందించాలని, వారు బలహీనతతో ఉండరాదని అన్నారు. చిన్నారుల ఎదుగుదలకు అంగన్వాడీ టీచర్లు నిరంతరం కృషి చేయాలని అన్నారు. పిల్లలు వయసుకు తగ్గట్టు ఎత్తుకు తగ్గ బరువు ఉండాలని సూచించారు. అంగన్వాడి సెంటర్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం చిన్నారుల ఎత్తు కొలతలను పరిశీలించి, పలు రిజిస్టర్లను పరిశీలించారు. కాగా మండల క్రీడా పోటీలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీఓ బ్రహ్మం, ఇన్‌చార్జి సిడిపిఓ కళావతి, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

కార్మికులందరికీ లేబర్ కార్డులు ఇవ్వాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

భవన నిర్మాణ రంగాల కార్మికులందరికీ లేబర్ కార్డులు ఇవ్వాలరి, బోగస్ కార్డులను ఏరివేయాలని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం వ్యవస్థాపకులు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కామాల ఐలయ్య అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హక్కులు సాధించుకోవాలంటే కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ప్రతి మండలంలో కార్మికుల ఐక్యత కోసం కృషి చేస్తున్నట్టు తెలిపారు. 50 ఏండ్లు నిండిన భవన నిర్మాణ రంగ కార్మికులందరికీ రూ.5000 పెన్షన్ చెల్లించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు డి శ్యామ్, సీనియర్ నాయకులు మాజీ అధ్యక్షులు డీ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు గణేష్, సంజీవులు, కార్యదర్శి కరీం, కోశాధికారి కాంతారావు, సాయిలు, తుకారం, సిద్ధు, రాములు, తోఫిక్, రాష్ట్ర నాయకులు ఉప్పు సాయికుమార్, జిల్లా కోశాధికారి సాయిలు, భాష భాయ్, మార్లు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన కార్మికులు

ఉత్కంఠగా సాగిన క్రీడా పోటీలు

నవతెలంగాణ-లింగంపేట్/ఎల్లారెడ్డి

ముఖ్యమంత్రి కప్ పోటీలు రెండో రోజు శనివారం లింగంపేట్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రసవతంగా కొనసాగాయి. ఉత్కంఠభరితంగా క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

మంగళవారం కోకో ఫైనల్ రాంపల్లి స్కూల్ తండా వర్సెస్ సజ్జనపల్లి గ్రామాల మధ్య కోకో ఆట రసవతంగా కొనసాగింది. విన్నర్‌గా రాంపల్లి స్కూల్ తండా గెలుపొందగా రన్నారుగా సజ్జనపల్లి క్రీడాకారులు దక్కించుకున్నారు. క్రీడాకారులను రాంపల్లి స్కూల్ తాండ సర్పంచ్ పరశురాం నాయక్, సజ్జనపల్లి సర్పంచ్ పుట్టి పోచయ్య అభినందించారు. ప్రతిభ కనపరిచిన విజేతలకు చివరి రోజు బహుమతులు అందజేయనున్నట్టు ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి తెలిపారు.



లింగంపేట్‌లో..

గెలుపొందిన క్రీడాకారులకు అభినందన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సిఎం కప్ గెలిచిన అభ్యర్థులకు ఎంపిపి మాధవి, జడ్పీటీసీ ఉష గౌడ్ అభినందనలు తెలిపారు. సిఎం కప్ 2023 టోర్నమెంట్ మండల స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీలలో కబడ్డీలో ప్రథమ బహుమతి, వాలీబాల్‌లో ద్వితీయ బహుమతి 400 మీటర్స్, లాంగ్ జంప్ భిక్కనూర్‌కు వచ్చినట్టు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయిలో పోటీలకు పంపనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నారాయణ, ఎంపిఓ ప్రకాష్, భిక్కనూర్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి ఆలయంలో పూజలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఈసన్నపల్లి రామారెడ్డి లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో వైశాఖమాస నాలుగవ మంగళవారం స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వా రిని నాగిరెడ్డిపేట్ జెడ్పి టిసి మనోహర్ రెడ్డి, గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్ సాయినేని సత్యం రావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సందర్శకుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించింది.



హాజరైన సందర్శకులు

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

నవతెలంగాణ-గాంధారి

బైక్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి యువకుడు మృతిచెందిన ఘటన బూర్గుల్ ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని తిప్పారం గ్రామానికి చెందిన మద్దెల సాయికుమార్ (23) తిప్పారం నుండి బైక్‌పై తన స్నేహితుడు పాండురంగారెడ్డితో కలిసి బ్రహ్మాజివాడికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో బూర్గుల్ ఎక్స్ రోడ్ వద్దకు చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న టాటా గూడ్స్ బండి తప్పించడానికి బ్రేక్ వేయగా బండి స్కిడ్ అయి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని తండ్రి మద్దెల సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.



మృతిచెందిన సాయికుమార్

ఎమ్మెల్యేను కలిసిన రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు



సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు మర్యాదపూర్వకంగా జగిత్యాల శాసనసభ సభ్యులు రోటరీ సభ్యులు డాక్టర్ బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ నెల 21వ తేదీన ప్రారంభించ బోయే గిరిజా కంటి వైద్యశాల కార్యక్రమానికి ఆహ్వానించారు. ఇదే సందర్భంలో రోటరీ కార్యాలయాన్ని కూడా సందర్శించనున్నారు. కార్యక్రమంలో రోటరీ నిజామాబాద్ ప్రధాన కార్యదర్శి డాక్టర్.విశాల్ ఆకుల, మాజీ అధ్యక్షులు డాక్టర్ పీటీ కృష్ణమూర్తి, ఆర్.జగదీశ్వర్‌రావు, వి.శ్రీనివాస్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడికి పరామర్శ

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విద్యాసాగర్ గత కొన్ని రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై నుంచి అదుపుతప్పి కింద పడటంతో కాలు విరిగింది. దాంతో ఆయన నడవలేకుండా ఇంటికి పరిమితం కావడంతో సమాచారం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రేణిగుంట నాంపల్లి, జిల్లా ఇన్చార్జ్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు మోహన్, రాష్ట్ర నాయకులు చంద్రయ్య, పోశెట్టి, సుధాకర్ విద్యాసాగర్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ : ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ జిల్లాలో ఐకేపీ వీవోఏల సమ్మె శిబిరాన్ని సీఐటీయూ బృందం సందర్శించి సంఘీభావం తెలిపింది. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కారం అవుతాయని అనుకుంటే గ్రేడింగ్ విధానంతో పనిభారం మోపుతూ ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. గ్రామాల్లో మహిళలందరినీ ముందుకు నడిపించడం, వారికి బ్యాంకుల నుంచి అప్పులు, లోన్లు ఇప్పించి వారికి స్వయం ఉపాధి కల్పిస్తూ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధికి తోడ్పడే వీవోఏలు అందరూ నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలకు చెందిన వారే ఉన్నారని తెలిపారు. అందులో మహిళలే ఎక్కువ మంది ఉన్నారని వివరించారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని చెప్పారు. ఐకేపీ వీవోఏలు గత 23 రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలను పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలవాలన్నారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హులైన వీవోఏలను సీసీలుగా ప్రమోట్ చేయాలని తదితర సమస్యలు పరిష్కరించే విధంగా, ప్రభుత్వం సమ్మె విరమింపచేయాలని, లేనియెడల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం ఈ పోరాటం ద్వారా చెప్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శంకర్, ఐకేపీ వీవోఏలు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : వీవోఏలకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

చాలీచాలని వేతనాలతో బతకడం ఎలా..?

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల వీఓఏల సమ్మె 23వ రోజులో భాగంగా తమ డిమాండ్ల సాధన పట్ల నినాదాలు చేశారు. ఇందల్‌వాయి వీఓఏ సంఘం మండలాధ్యక్ష, కార్యదర్శి సరళ, కె.రాము మాట్లాడుతూ వీవోఏలు చాలీచాలని జీతాలతో నెలకు రూ.3900 తీసుకుంటూ బతకడం ఎలా అని ప్రశ్నించారు. తమ డిమాండ్లను కేసీఆర్ ప్రభుత్వం నెరవేర్చకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉధ్యక్షురాలు సువర్ణ, కోశాధికారి మమత, సభ్యులు కవిత, సౌమ్య, అరుణ, స్వప్న, అలేఖ్య, రాధిక, లావణ్య, భాగ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వర్ని : ఐకేపీ వీవోఏల సమ్మె మండలంలో కొనసాగింది. తమ సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వీవోఏలు నినాదాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసి తమకు తమ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవోఏలు షమీం, వినోద, శివకుమారి, అశ్విని, రింకిత, స్వప్న, అను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- అందులో భాగంగానే అభివృద్ధి పనులు
- మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ అన్నారు. మంగళవారం నగరంలోని 41వ డివిజన్‌లో సుమారు రూ.10లక్షల నిధులతో చంద్రశేఖర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల వెనుకాల సీసీ రోడ్డు వేయుటకు, అలాగే సెయింట్ పాల్ స్కూల్ వెళ్లే దారిలో 3లక్షల నిధులతో డబ్ల్యూబీఎం రోడ్డు వేయుటకు, 45వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో రూ.10లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసి ప్రారంభించినట్టు మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మాట్లాడుతూ.. నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పార్టీలకు అతీతంగా గౌరవ ఎమ్మెల్యే నిధులను కేటాయిస్తూ నగర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్టు తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులకై కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు కార్పొరేటర్ల తరుపున నగర ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు ఇందిరా, ఆకుల హేమలత, బీఆర్ఎస్ నాయకులు చంగుబాయ్, అహ్మద్, శ్రీనివాస్, శివ చరణ్, మున్సిపల్ ఇంజనీర్ పావని, అధికారులు, నాయకులు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్

మహిళల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్ద పీట..

నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరుగుతున్న ఆరోగ్య మహిళ కేంద్రాన్ని మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ సందర్శించారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ స్నేహతో మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ కేంద్రం గురించి ప్రజలలో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటికి దీపం ఇల్లాలు అనే నానుడిని నిజం చేస్తూ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతూ ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని చేపట్టారని ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం మహిళలకు ఆరోగ్య పరిరక్షణకై పరీక్షలు నిర్వహించి ఏదైనా సమస్యలుంటే జిల్లా ఆసుపత్రిలో వైద్యం అందించే విధంగా సేవలను అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను మహిళలు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఏమైనా సమస్యలుంటే పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కులవర్గ పోరాటాలను నిర్మించడమే 'మారోజు వీరన్న'కు నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్

బహుజన కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మారోజు వీరన్న 24వ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా వద్ద వీరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. హైదరాబాద్‌లో జరిగే వీరన్న రాష్ట్రస్థాయి వర్ధంతి సభకు జిల్లా కార్యదర్శి దేవరాజు మల్లికార్జున్ నాయకత్వంలో బీసీపీ బృందం బయలుదేరింది. ఈ సందర్భంగా బహుజన కమ్యూనిస్టు పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి దేవరాజు మల్లికార్జున్ మాట్లాడుతూ.. కామ్రేడ్ మారోజు వీరన్న మార్క్సిజానికి జ్యోతిబాపూలే, అంబేద్కర్ సిద్ధాంతాన్ని జోడించి భారత దేశంలో కుల వ్యవస్థ నిర్మూలన జరగాలంటే కులవర్గ జంట జమిలి పోరాటాలను నిర్మించాలని సిద్ధాంతికరించాడని తెలిపారు. చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి జరుగుతుందని నమ్మి ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించాడని వివరించారు. పేద ప్రజల హక్కుల కోసం, అణగారిన కులాల హక్కుల కోసం, కుల అస్తిత్వ సంఘాలను నిర్మాణం చేశాడని వివరించారు. కులరాజాధికార సభలను ఏర్పాటు చేశాడని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ నాయకులు జి.రమేష్, కంకణాల సిద్ధిరాములు, గంగన్న, నతనియల్, సుధాకర్, గోపి యాదవ్, దండం పోషన్న, డి.కర్ణాకర్, యాటరాజు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఉమ్మడి మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆసుపత్రిలో చికిత్స పొందిన మహిళలకు బోధన్ ఎంపీపీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుపేద రోగులు ఆసుపత్రిలో చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ సీఎం రిలీఫ్ ఫండ్ పేరిట ఆర్థిక సాయం చేస్తున్నారని, రోగులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 17మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్టు తెలిపారు. అనారోగ్యం, ప్రమాదాల బారిన పడి ప్రవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నదని అన్నారు. ఆర్థిక సహాయం మంజూరు చేసిన సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే షకీల్ అమేర్, ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు మాజీ మండల కోఆర్డినేటర్ బుద్దె రాజేశ్వర్, సర్పంచ్‌లు గుండారం శంకర్, లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు నర్సారెడ్డి, మేడి రవి, షాకీర్ పటేల్, కల్లూరు లక్ష్మణ్, భవానిపేట్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన చెక్కులతో బాధితులు

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రేషన్ కార్డ్ సైట్ ప్రారంభించి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డ్ సైట్ ఓపెన్ చేసి అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బహిరంగలేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కరికి తెల్ల రేషన్ కార్డు ఇవ్వలేదని, నిత్యావసర సరుకుల ధరలు పెరిగినందున ప్రభుత్వాలు పేదలకు 10 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి సామాన్యులను కాపాడాలని, ఆకలితో అలమటించే వారికి మేలు కలుగుతుందని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు బీఆర్ఎస్ గడిచిన తొమ్మిది సంవత్సరాలలో రేషన్ కార్డులు పేదలకు ఇచ్చే ఆలోచన చేయలేదని ఎద్దేవా చేశారు. తెల్ల రేషన్ కార్డుతో, రేషన్ షాప్‌లలో బియ్యంతో పాటు, ఆరోగ్యశ్రీ, ఇతర ప్రభుత్వ శాఖలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనేక పథకాలకు ముడిపడి ఉందని అన్నారు. అందుకు ఈ నెల 17న జరిగే బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజాప్రతినిధుల సమావేశంలో నేతలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇచ్చే విధంగా ఒత్తిడి తేవాలని, ఇప్పటికే తెల్ల రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన వారు కొందరైతే, మరికొందరు ఇప్పటికే రేషన్ కార్డులలో ఉండి పెళ్లై వారసులు పెరిగిన వారు తెల్ల రేషన్ కార్డులలో వారసుల పేర్లు నమోదు చేసుకుందామనుకుంటే రేషన్ కార్డు సైట్ ప్రారంభం కావడం లేదని అన్నారు. వెంటనే సైట్‌ను ప్రారంభించి అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి బహిరంగలేఖ ద్వారా విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి వై.ఓమయ్య, ఆనంద్, ప్రకాష్ పాల్గొన్నారు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

దేవగాండ్ల సంఘం మండలాధ్యక్షుడిగా గాండ్ల రాజ్ కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

దేవగాండ్ల సంఘం మండలాధ్యక్షులుగా మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో దేవగాండ్ల కుల సంఘ సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గాండ్ల రాజ్‌కుమార్, కార్యదర్శిగా సుంకాజి రవిరాజ్, కోశాధికారిగా సందరి రవీందర్, ప్రధాన సలహాదారులుగా గాండ్ల సాంబయ్య, గాండ్ల శ్రీనివాస్, గార్ల శివ, గాండ్ల రవికుమార్, గాండ్ల రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు గాండ్ల రాజ్ కుమార్ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కుల సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దేవగాండ్ల సంఘం అభివృద్ధి కోసం అహర్నిశలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గాండ్ల తేలికుల యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన రాజ్‌కుమార్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

నవతెలంగాణ-మోపాల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మోపాల్ మండలంలోని బాడ్సి సొసైటీ పరిధిలో ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశానుసారం ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ప్రణాళిక సంఘం సభ్యుడు, జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్, బాడ్సీ సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. చైర్మన్ నిమ్మల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తమ సొసైటీ పరిధిలో ప్రారంభించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ బాజిరెడ్డి జగన్‌కు, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ధన్యవాదాలు తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా సొసైటీ పరిధిలోనే తమ మొక్కజొన్నను కొనుగోలు చేస్తామని, గిట్టుబాటు ధర వస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, మోపాల్ ఎంపీపీ లతా కన్నీరం, జెడ్పీటీసీ కమల నరేష్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, మోపాల్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోచ్చ శ్రీనివాస్, సర్పంచులు ముత్యంరెడ్డి, కోల గంగాధర్, ఇందూర్ సిద్ధార్థ, ఎంపీటీసీ రమేష్, మోపాల్ సొసైటీ సింగిల్ విండో డైరెక్టర్ సింగం సతీష్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ అజీమ్, మండల వ్యవసాయాధికారి రవీందర్‌రెడ్డి, బాడ్సి సొసైటీ సీఈవో నరసయ్య, కెంపు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

జాడీజమాల్‌పూర్‌లో కంటి వెలుగు ప్రారంభం



కంటి అద్దాలు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సయ్య కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కంటి వెలుగు శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ ప్రియాంక, హారిక వృద్ధులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు దాసరి అంతయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి, ఏఎన్ఎంలు కళావతి, నిర్మల, ఆశావర్కర్లు, అంతోని మేరీ, శివబాయి, విజయ, అంగన్వాడీ టీచర్ చంద్రకళ, గ్రామపెద్దలు జోజయ్య, రాజేందర్, షేక్ మజార్, శ్రీనివాసరావు, మరియా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా



బస్టాండ్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ-ఆర్మూర్

టీఎస్ ఆర్టీసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రవిచందర్ ఆధ్వర్యంలో మంగళవారం డిపో ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్మికులకు రావాల్సిన 2013 బాండ్ డబ్బులు, 2017, 2021 పేస్కేల్ సీసీఎస్‌కు రావలసిన డబ్బులు, హైకోర్టు ఆదేశానుసారం వెంటనే ఆర్టీసీలో యూనియన్లను ప్రారంభించి గుర్తింపు సంఘం ఎలక్షన్‌లు జరిపించాలని కార్మికులపై పనిభారాలను వేధింపులను మానుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపో కార్యదర్శి అర్గుల్ రమేష్ మాట్లాడుతూ ఆర్టీసీలో ఏ యూనియన్ నాయకులు పట్టించుకోనప్పటికీ ఒకే ఒక్క ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ రాజారెడ్డి సార్ ముందుకు వచ్చి ఎన్నో పోరాటాలు ఎన్నో ధర్నాలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో సీసీఎస్ ప్రసాద్, డీసీ గోపి, భూమన్న, లక్ష్మణ్, గంగాధర్, స్వామి, రాజేశ్వర్, విజయ్‌కుమార్, గంగవ్వ, లక్ష్మి, త్రివేణి, సుమలత ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలిసెట్ 2023 పరీక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

పాలిసెట్ 2023 పరీక్ష బుధవారం ఉందని నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు, పోలీస్ సిబ్బంది అన్ని సెంటర్ల వద్ద పకడ్బందీగా బందోబస్తును ఏర్పాటు చేస్తూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలియజేశారు. మొత్తం 16 పరీక్ష కేంద్రాలు ఉండగా 16 కేంద్రాల చుట్టుపక్కల ఉన్న అన్ని జిరాక్స్ షాపులను బంద్ చేసి ఉంచాలని పోలీసులు ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉండాలని పేర్కొన్నారు. పరీక్ష 11 గంటలకు ప్రారంభం కాగా మధ్యాహ్నం ఒకటి గంటల 30 నిమిషాలకు అయిపోతుందని తెలిపారు. కావున పరీక్షకు వచ్చే అభ్యర్థులు ఒక గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకుంటే బాగుంటుందని, సకాలంలో పరీక్ష రాసి ఇంటికి వెళ్లొచ్చని తెలియజేశారు. కావున నిజామాబాద్ ఏసీపీ అన్ని పరీక్ష కేంద్రాలను ఎస్‌హెచ్‌ఓలను, ఎస్ఐలను ఎస్కార్ట్ సిబ్బందితో పర్యవేక్షణ చేయాలని ఆదేశాలను జారీ చేశారు. మొత్తం 16 సెంటర్లలో 6220 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు డిస్ట్రిక్ కో ఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. అభ్యర్థులు సమయపాలన పాటించాలని వివరించారు.

ఎమ్మెల్యేను కలిసిన సర్పంచులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రజలకు కావలసిన పనులు కమ్యూనిటీ హాలు, రోడ్లు, మౌలిక వసతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై సర్పంచులు కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మండలంలోని గోవింద్‌పేట్, చేపూర్, రాంపూర్, దేగాం, పిప్రి, ఫతేపూర్, సుర్బిర్యాల్, మిర్ధాపల్లి, అంకాపూర్, మగ్గిడి, గగ్గుపల్లి, కోమన్‌పల్లి, అందాపూర్, ఆలూర్, ఇస్సాపల్లి, మంథని, మచ్చర్ల గ్రామాల సర్పంచులు గంగాధర్, ఇందూరు సాయన్న, బంటు దయానంద్, గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి లింబాద్రి, గణేష్, మధువర్మ, కిషోర్‌రెడ్డి, నరసయ్య, ప్రదీప్, రాజేశ్వర్, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, దార్ల రాజు, లింబారెడ్డి, గంజి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో సర్పంచ్‌లు

సీఎంఆర్ఎఫ్‌తో పేద ప్రజలకు మెరుగైన వైద్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని బీ ఆర్ఎస్ మండలాధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి అన్నారు. మంగళ వారం బాల్కొండ మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మండలంలోని బాల్కొండ, వన్నెల్ (బి), చిట్టాపూర్‌కు చెందిన ఏడుగురు లబ్దిదారులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను లబ్దిదారుల కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద కుటుంబాలకు లబ్దిచేకూరేలా చెక్కులను అందజేసినట్టు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల కోసం మెరుగైన వైద్యం అందించేందుకు వెసులుబాటు కల్పిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఆపదలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకుంటున్నారని తెలిపారు. లబ్దిపొందిన కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మూడు గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్దిదారులకు రూ.3లక్షల 63వేల వ్యయంతో కూడిన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యాసాగర్, గ్రామశాఖ అధ్యక్షులు సాగర్ యాదవ్, కోటగిరి శ్రీకాంత్ చారి, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యులు ఆకుల నరేందర్, నాగులపల్లి కిషన్, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఫయాజ్ అలీ, ఉప సర్పంచ్ షేక్ వాహబ్, సొసైటీ వైస్ చైర్మన్ వేంపల్లి పెద్ద బాల్ రాజేశ్వర్, డైరెక్టర్లు డాక్టర్ ప్రసాద్‌గౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వేంపల్లి చిన్న బాల్ రాజేశ్వర్, సయ్యద్ మాజారోద్దీన్, వార్డు సభ్యులు గాండ్ల రాజేష్, మాజీ ఎంపీపీ కిషన్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎంఏ షాహిద్, మండల నాయకులు దుదాటి సూర్యప్రకాష్, దివాన్ వెంకటేష్, కొండ అశోక్, నల్లూరి హరికృష్ణ, తోట గంగాధర్, పిట్ల దయాకర్, సయ్యద్ ఇంతియాజ్, ఖాజీమ్, తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన చెక్కులతో లబ్దిదారులు